విస్తరణ కాకపాయె.. ట్రాఫిక్ జామాయె..

- విస్తరించని రోడ్లు, స్తంభిస్తున్న ట్రాఫిక్
- స్టేషన్ ముందున్న స్థలం పెయిడ్ పార్కింగ్‌కు కేటాయింపు
- రోడ్లపైనే వాహనాలు, రాకపోకలకు ఇబ్బందులు



లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లేదారిలో స్తంభించిన ట్రాఫిక్

శేరిలింగంపల్లి: రైలు ప్రయాణం చేయడం కన్నా రైల్వే స్టేషన్‌కు చేరుకోవడమే ఒక సమస్యగా మారింది. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రయాణికులు ఇక్కట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్‌తో ఇబ్బందులు తలెత్తుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమతున్నాయి. శివారులో అతిపెద్ద రైల్వేస్టేషన్ అయినా నిత్యం తప్పని ఇక్కట్లు అంటూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లోని 1వ ప్లాట్ ఫామ్ వైపు వెళ్లేందుకు రద్దీకి అనుగుణంగా రోడ్డు లేక నిత్యం అవస్థలు తప్పడం లేదు. అప్రోచ్ సరిగా లేక నిత్యం ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు వాగ్వాదానికి దిగుతున్నారు. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫామ్‌కు చేరాలంటే దూబే, వేంకటేశ్వరకాలనీల నుంచే చేరాల్సి ఉంటుంది. ఈ కాలనీలలోని రోడ్డు చిన్నగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రైళ్లలో వచ్చేవారిని ఇంటికి చేర్చడానికి వచ్చే వాహనాలతో పార్కింగ్ సమస్యతోపాటు కాలనీరోడ్లపై పార్కింగ్ చేయడంతో కాలనీవాసులకే కాకుండా స్టేషన్‌కు వచ్చే వారికి నిత్యం నరకంగా మారింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, రైల్వే శాఖ సంయుక్తంగా ఈ రోడ్డు విస్తరణకు చర్యలు చేపడితే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటోంది.

డ్రాపింగ్, పికప్‌లతో చిక్కులే..

సాయంత్రం ప్లాట్‌ఫామ్ –1 వైపు దూర ప్రాంత ప్రయాణికులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వారిని పికప్, డ్రాపింగ్ కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అయితే 1వ ప్లాట్‌ఫామ్ వైపు రావాలంటే నరకం చవి చూడాల్సిందే. ప్రయాణికుల కన్నా స్థానిక కాలనీ వాసులు పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా దూబే కాలనీ, వెంకటేశ్వర కాలనీ వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్డు పైకి రావాలంటేనే జంకుతున్నారు. స్టేషన్ ఎదురుగా పాఠశాల ఉండటంతో విద్యార్థులను డ్రాపింగ్ చేసేందుకు తల్లిదండ్రుల వాహనాలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను పికప్ చేసుకునేందుకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. పార్కింగ్ చేసుకునేందుకు కనీసం స్థలం కేటాయించకపోవడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సాయంత్రం వేళ ఇలా..



స్టేషన్ ముందు ఆటోల తిష్ట

ఎంఎంటీఎస్ స్టేషన్‌కు వెళ్లే వైపూ అంతే..

లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని ఎంఎంటీఎస్ ప్రయాణికులు కూడా నిత్యం అవస్థలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎంఎంటీఎస్ రాకపోకల ప్రారంభ స్టేషన్‌గా లింగంపల్లియే ఉండడంతో నిత్యం లింగంపల్లికి చేరువలోని కాలనీల్లో నివాసముండే ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ఇతరులు నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ చుట్టూరా ఉన్న భెల్ ఓల్డ్ ఎంఐజీ కాలనీ, న్యూ ఎంఐజీ కాలనీ, భెల్ టౌన్ షిప్, చందానగర్, మదీనాగూడ, దీప్తిశ్రీనగర్ ప్రాంత వాసులు రైల్వేస్టేషన్‌లో డ్రాపింగ్, పికప్‌లతో వ్యక్తిగత వాహనాలు భారీగా రాకపోకలు సాగిస్తుంటాయి.

రైల్వే అధికారులు స్పందిస్తేనే..

లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్ల సంఖ్య ఏటా పెరుగుతోంది. తెల్లవారుజాము నుంచే దేశం నలుమూలల నుంచి లింగంపల్లి స్టేషన్‌కు ముంబాయి ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, ఔరంగాబాద్ ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్, గౌతమి, కాకినాడ (ఏసీ), హంసఫర్, నారాయణాద్రి, ఫలక్‌నుమా నుంచి వాడీ వంటి 40 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ప్యాసింజర్ రైళ్లు లింగంపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి. సమీపంలోనే ఉన్న గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, రాయదుర్గం, గోపన్‌పల్లి వంటి ప్రాంతాలలో ఐటీ సంస్థలు పెద్ద సంఖ్యలో ఉండడంతో ఐటీ ఉద్యోగులు ఎంఎంటీఎస్ రైలు ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి వారికి ఆయా సంస్థలు తమ ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేసింది. దీంతో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ స్టేషన్‌పై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోస్టర్, బ్రోచర్ ఆవిష్కరణ



పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాయిబాబా

రాయదుర్గం: దివ్యజ్యోతి ఆడియోస్ శబరిమల మహా పాదయాత్ర-2024 పోస్టర్, బ్రోచర్‌ను శుక్రవారం ఖాజాగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా నానక్‌రాంగూడలోని రంగనాథ స్వామి ఆలయం నుంచి శబరిమలకు మహాపాదయాత్రను నిష్ఠతో చేస్తున్నారని గుర్తు చేశారు. అందులో భాగంగా 2024 ఏడాది కూడా అక్టోబర్ మాసంలో ఈ మహాపాదయాత్ర చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్యజ్యోతి ఆడియోస్, వీడియోస్ నిర్మాత ముత్యం రెడ్డి, పలువురు గురుస్వాములు, సన్నిదానం స్వాములు పాల్గొన్నారు.

యునెస్కో ప్రాజెక్ట్‌లో చేరాలని హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు ఆహ్వానం



ప్రొ. ప్రమోద్ కేనాయర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం లభించింది. హెచ్‌సీయూలోని ఇంగ్లిష్ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రమోద్ కేనాయర్‌కు యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా 'గ్రీనింగ్ విత్ సైన్స్, ఇన్నోవేషన్, టెక్నాలజీ' అనే ప్రాజెక్టులో చేరడానికి యునెస్కో ఆహ్వానించింది. యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ సౌత్–సౌత్ కోఆపరేషన్(యూఎన్ఓఎస్ఎస్‌సీ) సహకారంతో లాటిన్ అమెరికా, కరేబియన్‌లోని యునెస్కో ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషన్ (ఐఈఎస్ఏఎల్‌సీ) ద్వారా విధులను నిర్వహించేందుకు అవకాశం కల్పిస్తారు.

ఎల్ఓసీ అందజేత



రాయదుర్గం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంకు చెందిన బేబీ ఆఫ్ ఆనమ్ ఫాతిమాకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ ద్వారా మంజూరైన రూ.75 వేల పత్రాన్ని శుక్రవారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తుందన్నారు, ఆపదలో ఉన్నావారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు చల్లా శోభన్ పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా స్వాధీనం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో నిషేధిత గుట్కాను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జ్యోతినగర్ కాలనీకి చెందిన కృష్ణదత్తు, దీనబంధు దత్తు చెందిన కిరాణంషాపులో నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.69వేల విలువైన నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంతర్గత రోడున్ను సీసీ రోడ్డుగా మార్చాలి



రాయదుర్గంలో సీసీరోడ్డు వేయాల్సిన అంతర్గత రోడ్డు ఇదే

రాయదుర్గం: దశలవారీగా అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తామని చెప్పడం తప్ప తీసుకుంటున్న చర్యలు శూన్యమని రాయదుర్గం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా అంతర్గత రోడ్డులో పైప్‌లైన్ నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వి పైప్ లైన్లు, మ్యాన్‌హోళ్లు వేసి ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు సీసీరోడ్డు వేయకపోవడం విడ్డూరం. ఇప్పటికీ మట్టి రోడ్డుగానే స్థానిక బస్తీలో అంతర్గత రోడ్డు కొనసాగుతోంది. ఈ అంతర్గతరోడ్డును 'వాల్ టు వాల్' సీసీరోడ్డును వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో సీసీరోడ్డు వేస్తామని చెప్పి విస్మరించాలని ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీరోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: రోడ్డు, జంక్షన్ల విస్తరణ కోసం చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పర్యటించారు. ఒకటో బెటాలియన్ మెయిన్ గేట్ నుంచి తాహెర్ విల్లే రోడ్డు వరకు శిథిలావస్థలో ఉన్న భవనాలను కూల్చేందుకు బెటాలియన్ కమాండెంట్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. జంక్షన్ల విస్తరణ కోసం భూసేకరణకు సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. శ్మశాన వాటికలను సామాన్య ప్రజలు వినియోగించుకునేలా వెంగళరావునగర్ కార్పొరేటర్‌తో చర్చించాలని అధికారులకు తెలిపారు. ఆయన వెంట డీసీ ఎస్లావత్, ఈఈ రాజ్‌కుమార్, డాక్టర్ కవిత ఉన్నారు.

సదుపాయాల కల్పనలో ఉక్కు పాత్ర కీలకం



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

మాదాపూర్: భారతదేశంలో నిర్మాణం, మౌలికసదుపాయాల కల్పనలో ఉక్కు ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని ప్రభుత్వ ఉక్కు కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా తెలిపారు. మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో శుక్రవారం ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీల్ ఇన్‌ఫ్రాబిల్డ్ రెండో ఎడిషన్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలతో పాటు పరిసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి భారతదేశంలో మౌలికసదుపాయాల అభివృద్ధి, డెలివరిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిపుణులు తెలిపారు. ఉక్కు నిర్మాణ పద్ధతులు ప్రస్తుత ల్యాండ్ స్కేప్, సవాళ్లు, పరిష్కారాలు, పురోగమనాలు, నిర్మాణ, మౌలికసదుపాయాల రంగాలలో ఉక్కు ఆధారిత నిర్మాణాలను మరింత సమగ్రపరచడం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ సదస్సులో చర్చించారు. ప్రభుత్వ ఉక్కు కార్యదర్శి నవీన్ జిందాల్, ఇండియన్ స్టీల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందు ప్రకాశ్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ జయంత్ ఆచార్య, ప్రముఖ బిల్డర్లు పాల్గొన్నారు. అనంతరం ఎకనామికల్ గ్రీన్ అండ్ ఆల్వేస్ ఫాస్టర్ స్టీల్ షేపింగ్ ది ఫ్యూచర్ పేరుతో నాలెడ్జి రిపోర్ట్‌ను విడుదల చేశారు.

నేడు 'మనూ'లో 'మూట్ కోర్టు ప్రారంభం



మాట్లాడుతున్నప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో కొత్తగా ప్రారంభించిన లా స్కూల్‌లో మూట్ కోర్టును శనివారం భారత అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి చేతుల మీదుగా ప్రారంభిస్తారని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మూట్ కోర్టు అనేది మాక్ కోర్టు అని దీనిలో న్యాయ కోర్సులలో చేరిన విద్యార్థులు అభ్యాసం కోసం ఊహాజనిత కేసులను వాదిస్తారన్నారు. ఈ మూట్ కోర్టు లా విద్యార్థులకు కోర్టు గదిలో అవసరమైన నైపుణ్యాలను నేర్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ భాషలో న్యాయ కోర్సులను అందించేదని, అయితే ఇది 74 ఏళ్ల క్రితం నిలిపివేయబడిందని గుర్తుచేశారు, ఈ సమావేశంలో లా స్కూల్ డీన్ ప్రొఫెసర్ తబ్రేజ్, అహ్మద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొన్నారు.

రేపు 'సండే ఈవెనింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవెనింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో 'ఆర్ట్ ఆఫ్ బీయింగ్ హ్యాపీ' అనే అంశంపై ఇండోనేషియాకు చెందిన బీకే జానకి పద్మనాభన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రావెల్ బస్సు డ్రైవర్‌పై కేసు

మియాపూర్: మద్యం గాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ తెలిపారు. మియాపూర్‌లోని మెట్రో బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ కర్నూల్ జిల్లా నంద్యాలకు చెందిన ప్రకాష్‌రెడ్డి(55)కి పరీక్ష నిర్వహించగా మద్యం తాగినట్లు నిర్ధారించి కేసు నమోదు చేశారు.

పలువురికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 13 మందిలో ఐదుగురికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించగా మిగతా వారికి రెండు వేల జరిమానాతో పాటు జైలుశిక్ష విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని అదుపులోకి తీసుకొని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 05 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున జరిమానా, ఒకరికి మూడు రోజులు, నలుగురికి రెండు రోజులు, ముగ్గురికి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

లంగర్‌హౌస్: చిన్నారులకు సరైన భోజనం అందించడంతో పాటు ఆటాపాటలు కచ్చితంగా నేర్పాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం లంగర్ హౌస్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విషయం తెలిసిన స్థానిక నాయకుడు మాతంగి రమేష్ అక్కడకు వెళ్లి సమస్యలను వివరించాడు.

వసతుల కల్పనకు కృషి

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు మెగా సిస్టమ్స్, టీచ్ ఫర్ చేంజ్ సంయుక్తంగా కృషి చేస్తున్నాయని మెగా సిస్టమ్ ప్రతినిధి ధరణి కోట సుయోధన్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని దేవల్ ఝామ్‌సింగ్ ప్రభుత్వ, ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్, నీటి ట్యాంక్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద బస్తీలలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో మరింత మంది విద్యార్థులు చేరేలా గత దశాబ్ద కాలంగా తాము నగరంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. డిస్ట్రిక్ కోఆర్డినేటర్ రంజిత, దేవర వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం



రుద్రాక్షాలతో కాశీవిశ్వేశ్వరస్వామి



ప్రత్యేక అలంకారంలో గణేషుడి

రాయదుర్గం: వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ కాశీ విశ్వేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఉదయం ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామివారికి అర్చనలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసిన తర్వాత రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. గణేషుడికి తెల్లవస్త్రం, గరకతో ప్రత్యేక అలంకారం చేశారు. ఆ తర్వాత ఆలయంలో షిర్డీసాయిబాబా, అన్నపూర్ణాదేవి, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు..

ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో శనివారం నుంచి 15వ తేదీ వరకు ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి తెలిపారు. శనివారం ప్రత్యేక అభిషేకం, వారాహి పూజలు ప్రారంభిస్తామన్నారు. ఈ నెల 12న ప్రత్యేక అభిషేకం, అనంతరం పసుపుకొమ్ములతో అమ్మవారికి అభిషేకం, అర్చన, హారతి ఉంటాయన్నారు.

దోమల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు దోమ కాటుతో వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే తొలగించాలన్నారు. నీరు నిల్వ ఉండే చోట దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే'గా పాటించాలన్నారు. ప్రతి ఇంటికీ యాంటీ లార్వా ఆపరేషన్ చేసే ఎంటమాలజీ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం



మోతీనగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్‌కు చెందిన ఫాతిమా బేగంకు లక్ష రూపాయల ఎల్ఓసీ చెక్కును ఎమ్మెల్యే కృష్ణారావు బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా ఎంతో మందిని ఆదుకున్నారని అన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎల్లమ్మ చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలి

రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్



ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటిన రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు



ఎల్లమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న రవికుమార్ యాదవ్

ఆల్విన్‌కాలనీ: డా.శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకల్లో భాగంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ శంషీగూడలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఎల్లమ్మ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చుట్టు పక్కల కాలనీల డ్రైనేజీ చెరువులో కలవటంతో విపరీతమైన దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోందన్నారు. చెరువు చుట్టు పక్కల కాలనీల ప్రజలు దోమలు వృద్ధి చెందడంతో జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. నిలిచిపోయిన పైపులైన్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహంకాళీనగర్‌లో కాలనీ రోడ్డుకు నిధులు మంజూరైనా ఇంత వరకు పూర్తి చేయలేదన్నారు. సమస్యలను కాలనీవాసులు మా దృష్టికి తీసుకొస్తున్నారని ప్రజా సమస్యలపై పోరాడటానికి బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. సమస్యలను వీలైనంత త్వరలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, రామరాజు, మణిభూషణ్, నరేందర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, స్రవంతి, అరుణ్‌కుమార్, కేశవులు, నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, రఘు, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.